# మెట్రోరైలు ఎండీ పదవీకాలం మళ్లీ పొడిగింపు



ఎన్వీఎస్ రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ఈ నెలాఖరుతో ముగియనున్న మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి పదవీకాలాన్ని తెలంగాణ ప్రభుత్వం మరో ఏడాదిపాటు పొడిగించింది. 2020 జూన్ ఆఖరు వరకు పొడిగిస్తూ శుక్రవారం పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ ఉత్తర్వులు జారీచేశారు. ఇండియన్ రైల్వేస్ అకౌంట్స్ సర్వీస్ (ఐఆర్‌ఏఎస్)కు చెందిన రెడ్డి కేంద్ర సర్వీసు నుంచి 2009లో హైదరాబాద్ మెట్రోరైలు ఎండీగా నియమితులయ్యారు. 2016 జూన్ 30న పదవీ విరమణ చేశారు. ఆయన పదవీకాలాన్ని ప్రభుత్వం ఒక్కో ఏడాదిపాటు పొడిగిస్తూ వస్తోంది. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టిన అతిపెద్ద ప్రాజెక్ట్ హైదరాబాద్ మెట్రోనే కావడం, తొలిదశ పనులు ముగియనుండటం, రెండోదశ విస్తరణ, పాతబస్తీలో నిర్వహించాల్సిన పనుల నేపథ్యంలో.. అనుభవజ్ఞుడైన ఆయన సేవలను వినియోగించుకునేందుకే సర్వీసును పొడిగిస్తున్నట్లు పేర్కొన్నారు. మెట్రోను విమానాశ్రయం దాకా విస్తరించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో సంస్థకు ఆయనే ఎండీగా వ్యవహరిస్తుండటం తెలిసిందే. పదవీకాలాన్ని పొడిగించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# గ్లైడర్ కూలి.. ఇద్దరికి గాయాలు

## సిద్దిపేట జిల్లాలో ఘటన



సిద్దిపేట జిల్లా మామిడ్యాల సమీపంలో కూలిన గ్లైడర్

ములుగు, న్యూస్‌టుడే: గ్లైడర్ కూలి సిద్దిపేట జిల్లాలో ఇద్దరికి గాయాలయ్యాయి. ములుగు మండలం మామిడ్యాల సమీపంలో శుక్రవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులకు మామిడ్యాల సమీపంలో దాదాపు 30 ఎకరాల భూములున్నాయి. వారిలో శాస్త్రవేత్తలు, వాయుసేనకు చెందిన వారున్నారని తెలుస్తోంది. ఆ భూముల్లో పనుల పర్యవేక్షణకు వారు ఇక్కడే ఒక గ్లైడర్‌ను తయారు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ అనుమతితో సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. శుక్రవారం ఇద్దరు వ్యక్తులు వచ్చి గ్లైడర్‌లో ఎక్కి విహరించారు. వారు ప్రయాణిస్తున్న గ్లైడర్ కొండపోచమ్మ జలాశయం సమీపంలో ప్రమాదవశాత్తు కుప్పకూలిపోయింది. అందులో ఉన్న హైదరాబాద్‌కు చెందిన రాందాపర్, బెంగళూరుకు చెందిన అంచిత్ భాస్కర్‌కు గాయాలైనట్లు ములుగు ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ గ్లైడర్ గరిష్ఠంగా 100 మీ. ఎత్తులో.. 500 మీ. పరిధిలో మాత్రమే ఎగరగలదు.

# ఖాతాలో పడింది రూ.2,89,130 మాత్రమే

## తప్పుడు పత్రాలు సృష్టించి బీమా సొమ్ము కొల్లగొట్టిన కేసులో..

ఈనాడు, హైదరాబాద్: పాలసీదారులు మరణించినట్లు తప్పుడు పత్రాలు సృష్టించి వారికి రావాల్సిన బీమా సొమ్ము కొల్లగొట్టిన కేసులో ఏజెంట్ ఎం.ధనమూర్తి ఖాతాలో రూ.2,89,130 జమ అయినట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. కోదాడలోని జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) కార్యాలయంలో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి, మరికొందరు కలిసి పాల్పడ్డ ఈ కుంభకోణంపై హైదరాబాద్ సీబీఐ అధికారులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై జూన్ 5న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తలో ఎం.ధనమూర్తి ఖాతాలో జమ అయిన సొమ్ము రూ.28,98,130 అని ప్రచురితమైంది. కాని వాస్తవంగా ఆ సొమ్ము రూ.2,89,130 మాత్రమే.

# 20న ఎస్టీయూ 'చలో హైదరాబాద్'

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయులతోపాటు విద్యారంగంలోని పలు పరి సమస్యలపరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందంటూ.. జులై 20న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తామని ఎస్టీయూటీఎస్ ప్రకటించింది. రాష్ట్ర అధ్యక్షుడు బి.భుజంగరావు, ప్రధాన కార్యదర్శి జి.సదానందం 'చలో హైదరాబాద్' గోడ పత్రికలను, కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు.













# మాదక ఉగ్రవాద పంజా!

మాదక ద్రవ్య మహమ్మారినుంచి మానవాళికి ముంచుకొస్తున్న పెను ముప్పుపై ఏనాడో 1909లోనే షాంఘైలో మొట్టమొదటి అంతర్జాతీయ సదస్సు జరిగింది. దరిమిలా నూటపదేళ్లలో మాదక ద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, దుర్వినియోగాలను అదుపు చేసే బహుపాక్షిక వ్యవస్థల నిర్మాణం జరిగిందంటున్నా- కోట్లాది పచ్చని కుటుంబాలపై పెను చీకట్లను పరచేస్తూ మాదక రక్కసి సాగిస్తున్న మహా విధ్వంసం గుండెల్ని పిండేస్తోంది. మాదక ద్రవ్యాల వినిమయం అక్రమ రవాణాల నిరోధాన్ని లక్షిస్తూ 1987నుంచే అంతర్జాతీయ దినోత్సవాన్ని (ఏటా జూన్ 26) నిర్వహిస్తున్న సమితి ఆధ్వర్యంలోనే పదేళ్లనాడు రాజకీయ సంకల్ప ప్రకటన, కార్యాచరణ ప్రణాళికలూ వెలుగు చూశాయి. వాటి దారి వాటిదే కాగా, చాప కింద నీరులా మత్తు పానీయాలు మాదక ద్రవ్యాలు సృష్టిస్తున్న విలయ తీవ్రతకు సమితి తాజా నివేదికే అద్దం పట్టింది. మాదక ద్రవ్య సంబంధిత రోగాలతో మూడున్నర కోట్లమంది వైద్య సేవల కోసం అలమటిస్తున్నారని, ప్రతి ఏడుగురు బాధితుల్లో ఒకరికే చికిత్స లభిస్తోందని సమితి నివేదిక నిర్ధారించింది. ప్రపంచవ్యాప్తంగా కుటుంబాలు, సమాజాల ఆయురారోగ్యాల మీద, ఆయా దేశాల సుస్థిరాభివృద్ధి, భద్రతలపైనా మాదక శక్తుల పంజా దెబ్బ తీవ్రతను ప్రస్తావిస్తూ- నేర న్యాయ వ్యవస్థ, ఆరోగ్య విభాగాలు, సామాజిక సేవల యంత్రాంగాలు సమన్వయంతో ఉమ్మడి పరిష్కారాలకోసం పని చేయాలని సమితి పిలుపిస్తున్నా- ఇండియా లాంటి వర్ధమాన దేశాల్లో దానికి మన్నన దక్కుతున్నదెక్కడ? జంట తలల విష భుజంగంలాంటి మత్తుపానీయాలు, మాదక ద్రవ్యాలు దేశ వర్తమానాన్నే కాదు- భవిష్యత్తునూ కసిగా కబళిస్తున్నాయనేందుకు నాలుగు నెలల క్రితం నాటి సర్కారీ సర్వేయే తిరుగులేని దాఖలా! మాదక ద్రవ్యాల గిరాకీ తగ్గింపును లక్షించిన జాతీయ కార్యాచరణ పథకం కొరగానిదని పదేపదే రుజువవుతున్న నేపథ్యంలో- పటిష్ఠ వ్యూహాన్ని పట్టాలకెక్కించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వీయ బాధ్యతను దులపరించేసుకోలేవు!

భారత రాజ్యాంగంలోని 47వ అధికరణ- ప్రజల జీవన ప్రమాణాలు, పౌష్టికాహార స్థాయి, ప్రజారోగ్యం మెరుగుదల ప్రభుత్వాల ప్రాథమిక విధుల్లో భాగమని స్పష్టీకరిస్తోంది. వైద్యపర అవసరాల్ని మినహాయించి ప్రజారోగ్యానికి చెరుపు చేసే మత్తుపానీయాలు, మాదక ద్రవ్యాల్ని ప్రభుత్వాలు నిషేధించాలనీ సూచించింది. శ్రేయోరాజ్య భావనకు గొడుగు పట్టిన ఆ రాజ్యాంగ అధికరణను క్రూరంగా అపహసిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెలగబెడుతున్న నిర్వాకం- కోట్లాది పచ్చని కుటుంబాల్లో ఏటా లిక్కర్ చిచ్చు పెడుతోంది. 2010-'17 నడిమికాలంలో ఇండియాలో ఆల్కహాల్ వినిమయం 38శాతం, అంటే- ఏటా తలసరి 4.3నుంచి 5.9 లీటర్లకు పెరిగిందని అంతర్జాతీయ అధ్యయనం ఎలుగెత్తి చాటింది. 2025నాటికి గరళ సదృశమైన ఆల్కహాల్ వినిమయాన్ని 10శాతం తగ్గించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ లక్షించినా- ఇండియా లాంటి చోట్ల లిక్కర్ వినియోగం పెరుగుతూపోతున్న తీరు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధననే మసకబారుస్తోంది. ఇండియాలో మందుబాబులు 2016లో ఆల్కహాల్‌పై వెచ్చించిన మొత్తం రెండున్నర లక్షల కోట్ల రూపాయలు; 2026నాటికి 1400 కోట్ల లీటర్ల సరకు వినియోగంతో మందు మార్కెట్ పరిమాణం అంతకు రెట్టింపు కానుందన్న అంచనాలున్నాయి. బొక్కసాలు నింపడానికి లిక్కర్ రాబడులపైనే ఆధారపడుతున్న సర్కార్లకు తెలియదేమో- దేశవ్యాప్తంగా అయిదు కోట్ల 70లక్షలమంది మందుకు బానిసలైపోవడంతో అన్ని కుటుంబాలు నిత్య నరకం అనుభవిస్తున్నాయి. కుటుంబాల్నే కూల్చేస్తున్న మద్య రక్కసికి కోరలూ కొమ్ములూ మొలిపించి తరిస్తున్న ప్రభుత్వాలు- పాఠశాలల దాకా పాకిపోయి చాక్లెట్ల రూపంలో పసివాళ్లనూ వ్యసనపరులుగా మార్చేస్తున్న మాదక శక్తులపై అక్షరాలా శీతకన్నేస్తున్నాయి!

అఫ్గానిస్థాన్, మియన్మార్, కొలంబియా, మెక్సికో, పాకిస్థాన్లతో పాటే ఇండియా సైతం మాదక ద్రవ్య వాణిజ్య కూడలిగా మారిందన్న నిజాన్ని అమెరికా ప్రభుత్వ నివేదిక మొన్నామధ్య బయటపెట్టింది. ముంజేతి కంకణానికి అద్దమెందుకన్నట్లు ప్రధాన నగరాల్ని దాటి చిరు పట్టణాలకూ మాదక శక్తుల విస్తరణ విస్తుగొలుపుతోంది. కౌమార ప్రాయంలోని పిల్లల్నీ మాదక ద్రవ్యాలకు బానిసలుగా మార్చి, వాటికోసం ఏం చేయడానికైనా వెనకాడని పరిస్థితి కల్పించి, వారినే సరఫరాదారులుగా ఉపయోగించే భయానక సాలెగూడు తరహా వ్యవస్థ దేశవ్యాప్తంగా చిలవలు పలవలు వేసుకుపోతోంది. దాదాపు నాలుగు లక్షల 60వేల మంది 17ఏళ్ల లోపు పిల్లలు పీల్చే మత్తు పదార్థాలకు బానిసలయ్యారని నాలుగు నెలల క్రితం 'ఎయిమ్స్' అధ్యయనమే వెల్లడించింది. దేశీయంగా రెండు కోట్ల 70 లక్షలమంది మాదక ద్రవ్యాలను వాడుతున్నారన్న నివేదికాంశాలు కాదు- నానాటికీ ఆ సంఖ్య ఇంతలంతలయ్యేలా సాగుతున్న మాదక మారీచుల వాణిజ్య సరళే భయభ్రాంతం చేస్తోందిప్పుడు! ఆరువారాల క్రితం నొయిడాలోని ఓ ఐపీఎస్ అధికారి ఇంటినుంచి స్వాధీనం చేసుకొన్న 1818 కిలోల సూడో ఎఫిడ్రిన్, రెండు కిలోల కొకైన్ విలువ- అక్షరాలా వెయ్యి కోట్ల రూపాయలు! మాదక ఉగ్రవాదాన్ని మట్టుపెట్టేలా జాతీయ విధాన రూపకల్పనకు ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ అభ్యర్థిస్తే- పంజాబ్, కశ్మీర్‌లకోసం సవిస్తృత వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నట్లు కేంద్రం తాజాగా ప్రకటించింది. దేశానికే పెనుముప్పుగా దాపురించిన మాదక మాఫియా వెన్ను విరవాలంటే, అన్ని రాష్ట్రాలతో కలసి కేంద్రం విస్పష్ట కార్యాచరణతో కదన భేరి మోగించాలి. మత్తుపానీయాల ఉరవళ్లకూ అడ్డుకట్ట వేసేలా రాష్ట్రాలనూ దారికి తీసుకు రాగలిగినప్పుడే సంక్షేమ భారతం సాక్షాత్కరించేది!

'ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజాసేవల అవసరాల రీత్యా ఏర్పాటయ్యాయి. వాటి పరిధి క్రమేపీ విస్తరించాలి. లక్ష్యాలను సాధించే దిశగా అవి పనిచేయాలి. ప్రభుత్వాలు విశాల దృక్పథంతో వ్యవహరించాలి. దూరదృష్టితో వాటి అభ్యున్నతిని




కాంక్షించాలి. లాభనష్టాలు కీలకమే. వాటివల్ల ప్రయోజనాలుండాలే గానీ అవి నిరర్థకంగా మారకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి...' దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల (పబ్లిక్ సెక్టార్ యూనిట్లు)పై తాజా నివేదికలో 'నీతి ఆయోగ్' చేసిన వ్యాఖ్యలివి.

# అపసవ్య విధానాలతో అస్తవ్యస్తం

దేశవ్యాప్తంగా ప్రభుత్వరంగ సంస్థల పనితీరు, మనుగడపై విస్తృతస్థాయిలో చర్చ జరుగుతోంది. పెట్టుబడుల ఉపసంహరణ, మూసివేత, దివాలా సంస్థల పునరుద్ధరణ వంటి కోణాల్లో చర్చ కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం ఈ సంస్థలపై దృష్టి కేంద్రీకృతమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ అనంతరం తొమ్మిది, పదో షెడ్యూలు కింద గల ఈ సంస్థల విభజన సంక్లిష్టంగా మారింది. పాలన వ్యవస్థలో అత్యంత కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థల విభజనపై అయిదేళ్లుగా జాప్యం జరుగుతోంది. ఇది ఆయా సంస్థలతో పాటు ప్రభుత్వంపైనా ప్రభావం చూపింది. ప్రస్తుతం సామరస్య ధోరణిలో, ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేయడం ఆశాజనక పరిణామం. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, రాష్ట్ర స్థాయి ప్రభుత్వ సంస్థలుగా వాటిని చూడాలి. పీఎస్‌యూగా మెజారిటీ వాటా (51శాతం అంతకంటే ఎక్కువ) ప్రభుత్వం యాజమాన్యంలో ఉండాలి. ఈ కోణంలో ఆలోచించి 1951లో భారతీయ టెలిఫోన్ సంస్థను మొదటగా స్థాపించారు. అదే సంవత్సరం మరో నాలుగింటిని ప్రారంభించారు. ఇప్పటి వరకు వాటి సంఖ్య 300కి చేరింది. రెండో పంచవర్ష ప్రణాళిక (1956-60), 1956 పారిశ్రామిక విధాన తీర్మానం ప్రభుత్వ రంగ సంస్థల అవసరాన్ని నొక్కి చెప్పాయి. కేంద్ర ప్రభుత్వ తరహాలోనే రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేశాయి.

## ఆరంభంలో సత్ఫలితాలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కాలరీస్. తరవాత రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రారంభమైంది. 2014 వరకు 89 ప్రభుత్వ రంగ సంస్థలు, మరో 107 ప్రాధికార సంస్థలు, సంఘాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు ఉన్నతాశయాలతో జరిగింది. ఆయా సంస్థలకు సమర్థులైన కార్యనిర్వాహక అధికారులను నియమించడం, అంకితభావం గల యంత్రాంగం అందుబాటులో ఉండటం వాటికి శుభారంభాన్ని ఇచ్చింది. ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాలు; ఉత్పత్తులు, క్రయవిక్రయాలు, ఒప్పందాల అమలు వీటి ద్వారానే జరుగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ కార్పొరేషన్, బీసీ, మైనారిటీ, దివ్యాంగుల కార్పొరేషన్ వంటివి ఆయా వర్గాల అభ్యున్నతికి కృషి చేశాయి. దళితులకు భూ పంపిణీ, ఉమ్మడి సేద్యం, కాలనీల నిర్మాణాల వంటివి నాలుగు దశాబ్దాల క్రితమే మొదలయ్యాయి. చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ, ఆగ్రోస్, తోళ్ల అభివృద్ధి సంస్థ వంటివి చిన్న తరహా ఉపాధికి సహాయం అందించాయి. బలహీన వర్గాల భూములకు నీటిపారుదల అభివృద్ధి సంస్థ నీటిపారుదల సౌకర్యాలను కల్పించింది. విత్తనాల పంపిణీలో విత్తనాభివృద్ధి సంస్థ సహకరించింది. సహకార నూనె గింజల ఉత్పత్తిదారుల సమాఖ్య విజయ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేసింది. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రజలకు ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. పల్లెలకు, పట్టణాలకు ఇప్పటికీ ఇదే ప్రధాన రవాణా వనరుగా ఉంది. ఒడుదొడుకులను ఎదుర్కొంటూ బొగ్గు రంగంలో ముందుకు సాగి సింగరేణి కాలరీస్ చరిత్ర సృష్టించింది.

ఏయే లక్ష్యాలతో ప్రభుత్వరంగ సంస్థలను ప్రారంభించారో, అదే పంథాలో అవి సాగితే వందశాతం విజయవంతమయ్యేవి. కొన్ని అపసవ్య విధానాల వల్ల అవి దారి తప్పాయి. ప్రభుత్వాలు కొన్నింటికి ప్రాధాన్యం




## ప్రభుత్వరంగ సంస్థలు - పనితీరు

ఇచ్చి మిగిలిన వాటిని నిర్లక్ష్యం చేశాయి. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రాధికార సంస్థలు రాజకీయ ప్రయోజనాలకు వేదికలయ్యాయి. తమ పార్టీ నేతలను ఈ సంస్థలకు ఛైర్మన్లుగా ప్రభుత్వాలు నియమించాయి. దానివల్ల రాజకీయ లక్ష్యాలను నెరవేర్చడానికి అవి సాధనాలుగా మారాయి. మొదట్లో ఐఏఎస్ అధికారుల నేతృత్వంలో ఇవి నడిచేవి. క్రమేపీ వాటిని రాష్ట్ర సర్వీసు అధికారులకు అప్పగించే విధానం మొదలయింది. రాజకీయ జోక్యాల వల్ల లబ్ధిదారుల ఎంపికలో పైరవీలు ప్రారంభమయ్యాయి. మరోవైపు ప్రభుత్వం వాటిని ఆదాయార్జన కోణంలో చూడటం ప్రమాదకరంగా పరిణమించింది. కొన్ని సంస్థల నుంచి ఆదాయం రావడం లేదని, సరైన పనులు లేవనే సాకుతో వాటిపై శ్రద్ధ పెట్టలేదు. నష్టాలను పరిగణనలోనికి తీసుకొని- కొన్ని సంస్థల మూసివేత దిశగా అడుగులు వేశారు. నిజాం సుగర్స్ సంస్థ ద్వారా తీవ్ర నష్టాలు వస్తున్నాయని, ఆ చక్కెర కర్మాగారాలను అతి తక్కువ ధరకు ప్రైవేటీకరించారు. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (ఐడీసీ), గృహ నిర్మాణ మండలి వంటి వాటిని నామమాత్రంగా మార్చారు. ఆర్టీసీపై అస్పష్ట ధోరణి కొనసాగుతోంది. విద్యుత్ సంస్థల నిర్వహణ నష్టాల్లో సాగుతున్నా అత్యవసర కేటగిరిలో ప్రాధాన్యం కోల్పోలేదు. పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఐఐసీ) వసతుల కల్పన కంటే భూముల క్రయవిక్రయాలు, కేటాయింపులకు కేంద్రంగా మారింది. కార్పొరేషన్ల పదవులు పొందిన నేతల్లో నిస్వార్థంగా సేవలందిస్తున్న నేతలు చాలా అరుదు. రాజకీయ, స్వప్రయోజనాల కోణంలోనే వారు పనిచేస్తున్నారు. పాలక మండళ్ల పరిస్థితీ ఇదే. రాజకీయాలకు తోడు పైరవీల కారణంగా పలు సంస్థల్లో అవినీతి తాండవిస్తోంది. రాష్ట్ర ఆర్థిక సంస్థ (ఎస్ఎఫ్‌సీ) ద్వారా మొదట్లో వివిధ సంస్థలకు అప్పులు ఇచ్చారు. సిఫార్సుల మేరకు ఇష్టారాజ్యంగా రుణ పంపిణీ జరిగింది. ఆ తరవాత చెల్లింపుల్లేవు. అప్పుల మాఫీ, ఆస్తుల జప్తులు, అమ్మకాల్లో అవినీతి తారస్థాయికి చేరాయి. మొత్తానికి తెలుగు రాష్ట్రాల్లో ఆ సంస్థ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. నామమాత్రంగా మారింది.

## పాలనపై ప్రభావం

ప్రభుత్వ విధానాలు ఆయా సంస్థల మనుగడకు ముప్పుగా మారాయి. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల నియామకాలు ప్రమాణాల ప్రాతిపదికన జరగలేదనే కారణంతో తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. వారికి పింఛను సౌకర్యం లేదు. ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్నా కొత్త నియామకాలు జరగడం లేదు. ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ రంగ సంస్థల్లో 60 శాతం మేరకు ఉద్యోగ ఖాళీలున్నాయి. బెవరేజెస్, ఖనిజాభివృద్ధి సంస్థ వంటి వాటిల్లో ముగ్గురి పనులను ఒక్కరే చేస్తున్నారు. ఆయా సంస్థల్లో కొత్త నియామకాల్లేవు. శాశ్వత ఉద్యోగులకు బదులు ఒప్పంద, పొరుగు సేవల సిబ్బందిని వాడుకుంటున్నారు. పరిపాలన సరమైన అవసరాల కోసం కొత్త కార్పొరేషన్లు ఏర్పాటవుతున్నా వాటికి అనుగుణంగా సిబ్బంది నియామకాలు లేవు. ప్రభుత్వరంగ సంస్థలకు సొంత భవనాలు, ఇతర మౌలిక వసతులను కల్పించడం లేదు. ఆ సంస్థలు 50 శాతం అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఏటా 'కాగ్' నివేదికల్లో ప్రభుత్వ రంగ సంస్థల దుస్థితిని ఎత్తి చూపుతున్నా- వాటిని ఆదుకునేందుకు ప్రభుత్వాలు అడుగు ముందుకు వేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రభుత్వరంగ సంస్థల మూసివేత లేదా ప్రైవేటీకరణ వంటి ప్రతిపాదనలను ప్రభుత్వ వైఫల్యాలుగానే పరిగణించాలి. ఆయా సంస్థల్లోని ఉద్యోగులు, అధికారులు సైతం పోటీ పరిస్థితులను గుర్తించి, ఆ దిశగా పనితీరును మెరుగుపరచుకునేందుకు కృషి చేయాలి. ప్రభుత్వ రంగ సంస్థల్లో సంస్కరణలు వాటి ప్రగతికి దోహదపడాలి. ఇందుకు ప్రభుత్వాలే మార్గనిర్దేశం చేయాలి. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వస్థాయిలో ప్రభుత్వ రంగ సంస్థల నిర్వహణ అధ్వానంగా మారింది. అతి తక్కువ సంస్థలే మహారత్న, నవరత్న, మినీరత్న హోదాలు పొందాయి. కేంద్రంలో పరిస్థితులు ఎలా ఉన్నా- తెలుగు రాష్ట్రాల్లోని అన్ని సంస్థలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలి. సేవ, సానుకూల దృక్పథమే ప్రామాణికంగా ముందుకు కదలాలి. సింగరేణి కాలరీస్ వంటి సంస్థలు కొంగు బంగారంగా మారడం వెనక కార్మికుల శ్రమశక్తి దాగి ఉంది. దీనికితోడు ప్రభుత్వాలు కనబరచిన కార్యనిర్వాహక నైపుణ్యాలు అక్కరకొచ్చాయి. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను అత్యుత్తమ స్థాయికి తీసుకువచ్చేందుకు పాలకులు కంకణబద్ధం కావాలి!

## తెలుగు రాష్ట్రాల్లో సంక్లిష్టం



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2014లో రెండుగా విడిపోయిన తరవాత తొమ్మిది, పదో షెడ్యూలు పరిధిలో గల ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రాధికార సంస్థల విభజన సంక్లిష్టంగా మారింది. ఇందుకు ప్రభుత్వాలతో పాటు ఆయా సంస్థల పాలకమండళ్ల, అధికారుల ధోరణే కారణం. విభజన ప్రక్రియలో జాప్యం సైతం కొంత మేరకు అక్రమాలకు ఆస్కారం ఇచ్చింది. తమకు అనుకూలమైన చోట ఉద్యోగాల్లో కొనసాగించాలని కొందరు ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. దాదాపు అయిదేళ్ల పాటు సంస్థల విభజన జరగకపోవడం వల్ల ఆయా సంస్థల్లో సమస్యలు పేరుకుపోయాయి. ఇప్పుడు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్ స్నేహభావంతో ముందుకొచ్చారు. విభజన సానుకూలంగా జరగడం ఖాయమని తేలింది. విభజన జరిగితే సంస్థలకు సంబంధించిన ప్రధాన సమస్య తీరినట్లే. ఆ తరవాత వాటి పాలనపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించవచ్చు. ప్రభుత్వ రంగ సంస్థలను పటిష్ఠంగా మార్చాలి. మొత్తం సంస్థలను ముఖ్యమంత్రుల స్థాయిలో సమీక్షించడం వల్ల మెరుగైన ఫలితాలు సమకూరుతాయి. వాటికి కావాల్సిన మౌలిక వసతులు, ఉద్యోగ నియామకాలపై దృష్టి సారించాలి. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే వారికీ వేతన, భత్యాలు చెల్లించాలి. పింఛను సౌకర్యం కల్పించాలి. వాటిలో అవినీతిని పూర్తిగా నిర్మూలించడం తక్షణావసరం. రాజకీయ జోక్యం పరిహరించేందుకు చొరవ చూపాలి. పాలక మండళ్ల నియామకాలు అనివార్యమయితే నీతి, నిజాయతీ ప్రామాణికంగా ఎంపికలు చేయాలి.

**- అకారపు మల్లేశం**

# పాక్ కపట నాటకం

అఫ్గానిస్థాన్ విషయంలో పాకిస్థాన్ సరికొత్త నాటకానికి తెరతీసింది. ఇప్పటివరకు ఈ సరిహద్దు దేశంలో తాలిబన్ల రూపంలో చిచ్చు పెట్టిన ఇస్లామాబాద్ ఇప్పుడు పెద్దపెద్ద మాటలు చెబుతోంది. అఫ్గాన్ అభివృద్ధే ధ్యేయమని, అక్కడ శాంతి, సుస్థిరత నెలకొనాలన్నదే లక్ష్యమని గంభీర వచనాలు వల్లె వేస్తోంది. తాజాగా 'లాహోర్ ప్రక్రియ' పేరుతో ఈ నెల 22, 23 తేదీల్లో ప్రత్యేక సదస్సు నిర్వహించింది. పంజాబ్ ప్రావిన్స్‌లోని 'భూర్బన్' పట్టణంలో జరిగిన ఈ సదస్సులో అఫ్గాన్‌కు చెందిన 57 మంది నాయకులు పాల్గొన్నారు. అంతర్యుద్ధంతో సతమతమవుతున్న ఆ దేశంలో శాంతిస్థాపనే సదస్సు ఉద్దేశమని పైకి అదేపనిగా పాక్ నమ్మబలుకుతోంది. కానీ, అసలు ఉద్దేశం మాత్రం వేరే ఉంది. అఫ్గానిస్థాన్‌లో భారత్ పాత్రను, ప్రభావాన్ని పరిమితం చేయడం, లేదా పూర్తిగా తగ్గించడం దాని లక్ష్యమన్న అభిప్రాయం దౌత్యవర్గాల్లో ఉంది.

'భూర్బన్' సదస్సులో పాకిస్థాన్ విదేశాంగ మంత్రి షా మహమూద్ ఖురేషీ అఫ్గాన్ పట్ల ఎక్కడ లేని ప్రేమను ఒలకబోశారు. ఆ దేశ సమైక్యత, సమగ్రత, శాంతి, సుస్థిరతకు తాము పూర్తిగా కట్టుబడి ఉన్నామని భరోసా ఇచ్చారు. రెండు దేశాల మధ్య అపోహలు, అప నమ్మకాలు తొలగించడమే సదస్సు లక్ష్యమని ఉద్ఘాటించారు. ఖురేషీ వ్యాఖ్యల్లో నిజాయతీ లోపించిందన్న వ్యాఖ్యలు వినపడుతున్నాయి. నిజానికి అఫ్గాన్‌పై అంత అభిమానం, ప్రేమ ఉన్నట్లయితే పాకిస్థాన్ ప్రధాని కానీ, కీలకమంత్రులు కానీ సదస్సుకు హాజరయ్యేవారు. వారెవరూ సదస్సు వైపు కన్నెత్తి చూడలేదు. అఫ్గాన్ నుంచి సదస్సుకు హాజరైన వారిలో మాజీ ప్రధాని గుల్‌బుద్దీన్ హెక్మత్యార్, అఫ్గాన్ ఉన్నతస్థాయి శాంతి మండలి అధ్యక్షుడు కరీం ఖలిలీ, అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి దిగాలని భావిస్తున్న హనీఫ్ అత్మర్ తప్ప ముఖ్య నాయకులు లేరు. హనీఫ్ జాతీయ భద్రతా మాజీ సలహాదారుగా పనిచేశారు. మాజీ అధ్యక్షుడు హమీద్ కర్జాయ్‌ను ఆహ్వానించినప్పటికీ ఆయన హాజరు కాలేదు. గుల్‌బుద్దీన్ హెక్మత్యార్‌కు పాక్ అనుకూలవాదిగా పేరుంది. కీలకమైన తాలిబన్ల ప్రతినిధులను ఆహ్వానించకపోవడం గమనార్హం. అఫ్గాన్ వ్యవహారాలన్నీ తాలిబన్ల చుట్టూనే తిరుగుతున్నాయి. అలాంటప్పుడు వారు లేకుండా జరిగిన సదస్సుకు ఏపాటి ప్రాధాన్యం ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

అఫ్గానిస్థాన్‌లో అంతర్యుద్ధం ఆరంభం అయినప్పటి నుంచి ఆ దేశం పట్ల పాకిస్థాన్ కపట నాటకాన్నే ప్రదర్శిస్తోంది. తాలిబన్ల రూపంలో అక్కడ ఉగ్రవాదాన్ని ఎగదోస్తోంది. పైకి శాంతి వచనాలు వల్లిస్తూనే తెరవెనక చేయాల్సినదంతా చేస్తూనే ఉంది. 2015 ఆగస్టులో జరిగిన దాడులకు పాకిస్థానే కారణమని అప్పట్లో అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ ఆరోపించారు. పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ కవల పిల్లలని అభివర్ణించిన మాజీ అధ్యక్షుడు హమీద్ కర్జాయ్ సైతం దాడులకు పాక్ సైన్యం, గూఢచార సంస్థ ఐఎస్ఐ (ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్) కారణమని ధ్వజమెత్తారు. పాక్ ప్రభుత్వ మద్దతు లేకుండా తాలిబన్లు నెలరోజులు కూడా మనగడ సాగించలేరని ఆయన తరచూ చెప్పేవారు. తాలిబన్ల ఆరాచకాలకు అంతేలేదు. 2016లో ఏకంగా పార్లమెంట్ భవనంపైనే రాకెట్లతో దాడులు చేశారు. 2017 సెప్టెంబరులో కాబూల్ అంతర్జాతీయ విమానాశ్రయంపై విధ్వంసానికి తెగబడ్డారు. కాబూల్ నుంచి న్యూదిల్లీకి వెళుతున్న విమానంపై రాకెట్లతో విధ్వంసానికి దిగారు. అప్పటి అమెరికా రక్షణ మంత్రి జేమ్స్ ఎన్ మ్యాటిస్ లక్ష్యంగా ఈ దాడి జరిగింది. దేశంలోని కొన్ని ప్రాంతాలు ఇప్పటికీ తాలిబన్ల ఆధీనంలో ఉన్నాయి. పొరుగున ఉన్న పాకిస్థాన్‌లో తలదాచుకుంటూ వారు దాడులకు తెగబడుతున్నారు.




సదస్సులో ప్రసంగిస్తున్న పాక్ విదేశాంగ మంత్రి ఖురేషీ

## అఫ్గాన్‌లో నాడు చిచ్చుపెట్టి నేడు శాంతి వచనాలు

అఫ్గానిస్థాన్- పాకిస్థాన్ మధ్య సుమారు 2,200 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. దీనినే డ్యూరండ్ రేఖ అని వ్యవహరిస్తారు. సరిహద్దులో దాదాపు 900 కిలోమీటర్ల మేర కంచె నిర్మించారు. వాస్తవానికి అఫ్గాన్-పాక్ మధ్య ప్రత్యేక వైరం అంటూ ఏమీ లేదు. ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, వేషభాషల్లో సారూప్యత ఉంది. కానీ అఫ్గాన్ వ్యవహారాల్లో భారత్ పాత్ర దానికి రుచించడం లేదు. ముఖ్యంగా ఆ దేశ పునర్నిర్మాణంలో న్యూదిల్లీ క్రియాశీలకంగా వ్యవహరించడం మింగుడు పడటం లేదు. అఫ్గాన్ నేతలు సైతం పొరుగున్న ఉన్న తనను కాదని భారత నాయకులతో సాన్నిహిత్యం కలిగి ఉండటాన్ని జీర్ణించుకోలేకపోతోంది. అఫ్గాన్ శాంతి చర్చల్లో భారత్ భాగస్వామ్యం ఉండాలన్న అమెరికా సూచన పుండుమీద కారం చల్లినట్లుగా ఉంది. పునర్నిర్మాణం పేరుతో అఫ్గాన్‌పై భారత్ పట్టు సాధిస్తోందని, ప్రాబల్యం కోసం పాకులాడుతోందని అదేపనిగా అనుమానించడం ఇస్లామాబాద్‌కు అలవాటుగా మారింది. భారతీయ దౌత్య కార్యాలయం, కాన్సులేట్ కార్యాలయాలపై దాడులకు తెగబడుతోంది. జలాలాబాద్, కాందహార్, మజారే-ఈ-షరీఫ్, హీరత్‌లో భారత కాన్సులేట్ కార్యాలయాలు పని చేస్తున్నాయి. ముఖ్యంగా పాక్ సరిహద్దుల్లోని జలాలాబాద్, కాందహార్ కార్యాలయాలపై తాలిబన్లు పలుమార్లు దాడులకు తెగబడ్డారు. జలాలాబాద్ కార్యాలయంపై 2007, 2013, 2015, 2016ల్లో దాడులకు తెగబడ్డారు. 2009లో కాబూల్‌లోని భారత దౌత్యకార్యాలయంపైనా దాడికి దిగారు. భారత్ సంస్థలు చేపడుతున్న పునర్నిర్మాణ పనులకు ఆటంకాలు కలిగిస్తున్నారు. పాక్ దన్నుతోనే వారు ఈ ఆగడాలకు పాల్పడుతున్నారన్నది వాస్తవం. పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతం తాలిబన్లకు స్వర్గధామం వంటిది. అక్కడ వారు స్వేచ్ఛగా సంచరిస్తుంటారు. వారిని అడ్డుకునేవారే ఉండరు.

అఫ్గానిస్థాన్‌కు సంబంధించి భారత్ పాత్రపై పాకిస్థాన్‌కు అనుమానాలు, అపోహలు ఉన్నాయి. ఇక్కడ భారత్ ప్రాబల్యం, పట్టు సాధించడం తనకు ఇబ్బందికరమన్నది ఇస్లామాబాద్ అభిప్రాయం. కానీ, ఇవి వాస్తవాలు కావు. అంతర్యుద్ధంతో దెబ్బతిన్న మిత్రదేశానికి ఇతోధిక సాయం అందించడమే భారత్ లక్ష్యం తప్ప మరొకటి కాదు. ఆ ఉద్దేశంతోనే ఆ దేశానికి సకల హంగులతో పార్లమెంట్ భవనాన్ని నిర్మించి ఇచ్చింది. పశ్చిమ అఫ్గాన్‌లోని హేరత్ ప్రావిన్స్‌లో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టును 2016 జూన్‌లో మోదీ జాతికి అంకితం చేశారు. ఇంకా రహదారులు, విద్యుత్ వంటి మౌలిక రంగాల్లో అనేక పనులను చేపట్టింది. అఫ్గాన్‌లో ఉగ్రవాదానికి ఊతమివ్వడం మాని, పునర్నిర్మాణానికి చేతనైన సాయం చేయడం ద్వారా మాత్రమే కాబూల్‌కు ఇస్లామాబాద్ దగ్గర కాగలదు. అంతేతప్ప సదస్సులు, ప్రకటనలు, ప్రసంగాలతో అఫ్గాన్ ప్రజలకు చేరువ కాలేదు!

**- గోపరాజు మల్లపరాజు**

## ఈనాడు లేఖలు

### ముంచుకొస్తున్న ముప్పు

మితిమీరుతున్న వాయు కాలుష్యం ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తోందనడంలో మరోమాట లేదు. అయినప్పటికీ ముంచుకొస్తున్న ముప్పు గురించి పాలకుల్లో ఎలాంటి స్పందనా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వారు నామమాత్ర చర్యలతోనే సరిపెడుతున్నారు. వాహనాల వినియోగంలో నియంత్రణ పాటించాలి. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తగలబెట్టడం వంటి చర్యలను నిరోధించాల్సిన అవసరం ఉంది. కానీ, అలాంటి చొరవ ప్రభుత్వం వైపు నుంచి కొరవడింది. సభలు, సమావేశాల్లో ఆందోళన వ్యక్తం చేయడమే తప్ప కార్యాచరణ దిశగా అడుగులు పడటం లేదు. కాలుష్య నియంత్రణ చర్యల్లో ప్రభుత్వంతో పాటు ప్రజా సంఘాలు చొరవగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

- ఎస్.మల్లేశ్వరరావు, కేపీహెచ్‌బీ, హైదరాబాద్

### నేరపూరిత నిర్లక్ష్యం

చిన్నపాటి నిర్లక్ష్యానికి చిన్నారుల నిండు ప్రాణాలు బలవుతున్నాయి. పంట పొలాల కోసమో, వ్యక్తిగత అవసరాల కోసమో ఊళ్లలో బోరుబావులు తవ్వుతున్నారు. నీరు పడకనో, నీరు పడినా తరవాత గొట్టాలు వేయిద్దామనో యజమానులు వాటిని అలాగే వదిలేస్తున్నారు. ఫలితంగా చిన్నారులు వాటిల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. బోరు బావులను నిర్లక్ష్యంగా వదిలేయడాన్ని ప్రభుత్వాలు నేరంగా పరిగణించాలి. బోరు తవ్వాలంటే తహసీల్దారు ముందస్తు అనుమతి అవసరం. కానీ ఈ నిబంధన ఎంతవరకు అమలవుతోందన్నది అనుమానమే. ఇప్పటికైనా అధికారులు బోరుబావులకు ఇచ్చిన అనుమతులను పరిశీలించి, వాటి స్థితిగతులను పర్యవేక్షించాలి. యజమానులను హెచ్చరించి చర్యలు చేపట్టాలి.

- తుపాకుల సాయిచరణ్, బోరిగాం, నిర్మల్‌జిల్లా

# అవి కొరగానివి...

మానవులకు సత్కవులు అకారణ బంధువులు. సమాజహితం కోరేవారు కవులు. సార్వకాలికం సార్వజనీనమైన సత్యాలను వారు తమ కవిత్వంలో ప్రకటిస్తుంటారు. ఒకనాటి కవిశ్రేష్ఠులు వెల్లడించిన భావాలు నేటికీ మాసిపోని మానవీయ విలువలుగా సమారాధనీయమవుతున్నాయి. కవులు సూక్తుల రూపంలో, సుభాషితాల రూపంలో, శతక పద్యాల రూపంలో జాతికి మార్గదర్శనం చేసే ఉపదేశాన్నందించారు. సమాజాన్ని విస్మరించిన సాహిత్యానికి మనుగడ లేదు. మానవ సముదాయమే సమాజం. మనిషి మనుగడ కోసం, పురోగతిని కోరి ఎన్నో విలువైన సూచనలు చేస్తుంటారు కవులు. అవి ఎన్నటికీ శిరోధార్యమే.

మనిషి వేటిని స్వీకరించాలి, ఏయే విషయాలను వర్జించాలి, మానవ జీవితానికి ఏవి అవసరం, ఏవి అనవసరం అనే విషయంలో చక్కని సలహా తెలుగుకవుల పద్యాల్లో చూడగలుగుతాం.

'పెమ్మయ సింగధీమణీ' అనే మకుటంతో ఆరు పద్యాలు లభించాయి. మకుటం ఉన్న పూర్తి శతకం అలభ్యం కావటంవల్ల సాహిత్య పరిశోధకులు వీటిని చాటువులుగా పరిగణిస్తున్నారు. వాటిలో ఒక ఆణిముత్యం లాంటి పద్యం ఏవి కొరగానివో పేర్కొన్నది. 'వాసన లేని పువ్వు...' అనే పద్యంతోసహా ఈ ఆరు పద్యాలు పేరంరాజు జక్కన కృతంగా కొందరు పేర్కొన్నారు. ఇతడు 'విక్రమార్క చరిత్ర' కథా కావ్యకర్త జక్కన కావచ్చు.

పూవు-తావి ఈ రెండింటి సంబంధం విడదీయరానిది. పరిమళం ఉంటేనే పుష్పానికి గౌరవం. దేవతార్చనకైనా, స్త్రీల అలంకరణకైనా సువాసనలు విరజిమ్మే ప్రసూనాలను వినియోగిస్తారు కదా. వాసనలేని పువ్వు కొరగానిదన్నాడు కవి.

ఒకప్పుడు పిల్లలకు ప్రాథమిక విద్యాభ్యాసంలో పాటలు నేర్పుతూ 'గడపలన్నింటిలోన ఏ గడప మేలు' అని ప్రశ్న వేసి 'పండితులు కూర్చున్న మా గడప మేలు' అని సమాధానమూ చెప్పేవారు గురువులు. బుధవర్గంలేని పురం వ్యర్థమైనది. ఊరి ప్రజలకు మంచీచెడూ చెప్పడానికి, శుభకార్యాలకు సేద్య పనులకు ముహూర్తాలు సూచించడానికి గ్రామాలకు పండితులు అలంకారంగా ఉండేవారు. గ్రామ ప్రజలకు వారు పెద్దదిక్కుగా గౌరవ స్థానంలో మసలేవారు.



అంతర్యామి

భార్యాభర్తలు పరస్పర విశ్వాసంతో నడుచుకొన్నప్పుడే సంసార రథం సాఫీగా సాగుతుంది. 'నిత్య విశ్వాసం లేని భార్య' కాదు- మంచి భార్య కుటుంబ గౌరవానికి ఎంతైనా అవసరం. పుత్ర సంతానం గురించి ఎదురు చూడటమనేది నాడూ నేడూ ఉన్నదే అయినా ఆ పుత్రుడు గుణవంతుడు కావాలి. కుపుత్రుడివల్ల తల్లిదండ్రులకు మనశ్శాంతి కరవవుతుంది.

'అభ్యాసం కూసువిద్య' అన్నారు. ఎన్ని విద్యలు నేర్చినా, ఎన్ని శాస్త్రాలు అధ్యయనం చేసినా నిరంతర అభ్యాసం లేకపోతే ఆ విద్యలు విస్మృతికి గురవుతాయి. అందుకే ఆలంకారికులు కావ్య హేతువుల్లో ప్రతిభ, వ్యుత్పత్తితోపాటు అభ్యాసాన్నీ చేర్చారు.

లోకంలో మనుషుల మధ్య మంచి సంబంధాలు నెలకొనాలంటే చక్కని సంభాషణ అవసరం. 'ఎదుటివారితో మాట్లాడుతున్నా సభలో ప్రసంగిస్తున్నా చమత్కార సరసత లేకపోతే అది రాణించదు. దాన్నే 'పరిహాస కుశలత' అంటారు. గ్రాసమంటే ఆహారం. 'గ్రాసంలేని కొలువు' పనికి రాదన్నారు. అంటే బతకటానికి ధాన్యమో, వేతనమో ఉచితరీతిలో లభించకపోతే ఆ ఉద్యోగాన్ని విడిచిపెట్టాలి.

మనిషి దైనందిన జీవితంలో ఏవి వ్యర్థమైనవో, నిరుపయోగమో చెబుతూ కొన్ని సత్యాలను సమాజానికి అందించాడు కవి. కాలం మారుతున్నా ఇవి ఎప్పుడూ విలువ కోల్పోనివే!

**- డాక్టర్ దామెర వేంకట సూర్యారావు**

# ఈనాడు సినిమా


ప్రభాస్

## మంచు కొండల్లో 'సాహో' పాట

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సాహో'. శ్రద్ధాకపూర్ కథానాయిక. సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. వంశీ, ప్రమోద్, విక్కీ, నిర్మాతలు. ఇటీవల ఆస్ట్రియాలో పాటని తెరకెక్కించారు. 1368 అడుగుల ఎత్తున్న మంచు కొండలపైకి కేబుల్ కార్లలో వెళ్లి చిత్రీకరణ పూర్తి చేసింది 'సాహో' చిత్ర బృందం. బాలీవుడ్‌కి చెందిన ప్రముఖ నృత్య దర్శకురాలు వైభవి మర్చంట్ నేతృత్వంలో ప్రభాస్, శ్రద్ధాకపూర్‌లపై పాటని తెరకెక్కించారు. సుందరమైన ప్రదేశాల్లో చిత్రీకరించిన ఈ పాట సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలవబోతోందని, జిబ్రాన్ ప్రపంచస్థాయి నాణ్యతతో నేపథ్య సంగీతం అందిస్తున్నారని చిత్రవర్గాలు తెలిపాయి. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఈ సినిమాని ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఛాయాగ్రహణం: మది, కళ: సాబు సిరిల్, కూర్పు: శ్రీకర్‌ప్రసాద్.


సూర్య

## సూర్య... 'బందోబస్త్'

సూర్య - కె.వి.ఆనంద్ కలయికలో వచ్చిన 'వీడొక్కడే', 'బ్రదర్స్' చిత్రాలు ప్రేక్షకుల్ని మెప్పించాయి. ఆ ఇద్దరూ కలిసి మూడో చిత్రం చేస్తున్నారు. తమిళంలో 'కప్పాన్' పేరుతో రూపొందుతున్న ఆ చిత్రం 'బందోబస్త్'గా తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి తెలుగు పేరుని, సినిమా లుక్‌ని శుక్రవారం ట్విటర్ ద్వారా విడుదల చేశారు. ఈ చిత్రంలో మోహన్‌లాల్, ఆర్య, బొమన్ ఇరానీ, సాయేషా సైగల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుబాస్కరన్ నిర్మిస్తున్నారు. "కె.వి.ఆనంద్ మరో ఆసక్తికరమైన అంశంతో రూపొందించిన చిత్రమిది. 'రంగం'తో తెలుగు ప్రేక్షకుల్లో గుర్తింపుని సొంతం చేసుకున్న దర్శకుడు ఆయన. సూర్యని మరో భిన్నమైన పాత్రలో చూపిస్తున్నారు. సుబాస్కరన్ అత్యున్నత విలువలతో నిర్మిస్తున్నార"ని చిత్ర వర్గాలు తెలిపాయి. సముద్రఖని, పూర్ణ, నాగినీడు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఎం.ఎస్.ప్రభు, సంగీతం: హారిస్ జైరాజ్.

## నా ప్రపంచంలోకి వెళ్లాల్సిందే

ఎన్ని పనులున్నా రోజూ ఏదో ఒక సందర్భంలో నాదైన ప్రపంచంలోకి వెళ్లి రావల్సిందే అంటోంది కీర్తి సురేష్. 'మహానటి' చిత్రంతో తన కీర్తిని మరింత పెంచుకొన్న కథానాయిక ఈమె. ప్రస్తుతం తెలుగుపైనే ఎక్కువ దృష్టి పెట్టినా, తమిళం, హిందీ పరిశ్రమల నుంచీ అవకాశాలు అందుకొంటోంది. సినిమాలతో సంబంధం లేకుండా మీ గురించి కొన్ని విషయాలు చెప్పండని అడిగితే.. అదొక పెద్ద చరిత్ర అంటూ నవ్వేస్తోంది. "వ్యక్తిగతంగా నాకొక ప్రత్యేకమైన ప్రపంచం ఉంది. అందులోకి వెళ్లానంటే మరేదీ గుర్తుకు రాదు. నాకు ఇష్టమైన పనులన్నీ చేస్తుంటా. చిన్నప్పట్నుంచి మనకు కొన్ని హాబీలు ఉంటాయి కదా. అవి ఇప్పటికీ మరిచిపోలేదు. టీవీలో వంటలకి సంబంధించిన కార్యక్రమాలు, ఆటలు చూడటం మొదలుకొని... సంగీత సాధన చేయడం వరకు ఏదనిపిస్తే అది చేస్తా. ఇంట్లోకి అడుగు పెట్టానంటే అసలు నేనొక నటిని అనే విషయమే గుర్తుకు రాదు. సినిమా చూస్తున్నా దాన్ని ఒక ప్రేక్షకురాలిగా ఆస్వాదించడమే అలవాటు తప్ప మళ్లీ అందులో నన్ను నేను చూసుకోవడం ఇష్టం ఉండదు" అని చెప్పింది కీర్తి.


కీర్తి సురేష్

## కొబ్బరికాయ కొట్టారు


నాగచైతన్య

నాగచైతన్య కథానాయకుడిగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. సాయిపల్లవి కథానాయిక. నారాయణదాస్ నారంగ్, పి.రామ్మోహన రావు నిర్మాతలు. సికింద్రాబాద్‌లో పూజా కార్యక్రమాలతో చిత్రం లాంఛనంగా ప్రారంభమైంది. సెప్టెంబర్ తొలి వారంలో చిత్రీకరణ మొదలుపెట్టి, ఈ ఏడాది చివర్లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. "శేఖర్ కమ్ముల నుంచి 'ఫిదా' తర్వాత వస్తున్న చిత్రమిది. నాగచైతన్య - సాయి పల్లవి జోడీ ప్రధాన ఆకర్షణగా నిలవబోతోంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులతో పాటు... నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక జరుగుతోంద"ని చిత్రవర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి ఛాయాగ్రహణం: విజయ్ సి.కుమార్.


అనఘ

## కెమిస్ట్రీ కుదిరింది

కార్తికేయ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'గుణ 369'. మలయాళ భామ అనఘ కథానాయికగా తెలుగు తెరకు పరిచయమవుతోంది. అర్జున్ జంధ్యాల దర్శకుడు. అనిల్ కడియాల, తిరుమల్‌రెడ్డి నిర్మాతలు. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "కార్తికేయ, అనఘ చక్కటి అభినయం ప్రదర్శించారు. ఇద్దరి మధ్య మంచి కెమిస్ట్రీ కుదిరింది. అనఘ స్వతహాగా క్లాసికల్ డ్యాన్సర్ కావడం సినిమాకి కలిసొచ్చింది. టీజర్ చూశాక చాలా మంది కథానాయిక గురించి అడిగారు. ఆమె వాణిజ్య చిత్రాలకి సరిపడే కథానాయిక అవుతుంది. ఇదివరకు 'నట్పే తునై' అనే తమిళ చిత్రంలో నటించింది. అందులో కొన్ని సన్నివేశాలు చూసే ఈ సినిమా కోసం ఎంపిక చేశాం" అన్నారు.

## మీకు తెలుసా: బాలీవుడ్ విలన్‌గా షోయబ్ అక్తర్


అక్తర్

వాయువేగంతో బంతులు విసురుతూ ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను భయపెట్టడంలో సిద్ధహస్తుడు పాకిస్థాన్ క్రికెటర్ షోయబ్ అక్తర్. అయితే ఆయనకు బాలీవుడ్ ప్రేక్షకులను భయపెట్టే అవకాశం కూడా వచ్చిందట. క్రికెట్ కోసం అక్తర్ ఆ ఆఫర్‌ను వదులుకున్నారట. ఇంతకీ విషయమేంటంటే దర్శకుడు అనురాగ్ బసు 2006లో తెరకెక్కించిన 'గ్యాంగ్‌స్టర్' చిత్రం విజయాన్నందుకుంది. ఇమ్రాన్ హష్మి, కంగనా రనౌత్ నటించిన ఆ చిత్రంలో గ్యాంగ్‌స్టర్ దయా శంకర్ పాత్రలో షైనీ ఆహూజా నటించారు. అయితే చిత్ర నిర్మాత మహేష్ భట్ తొలుత ఆ పాత్రకు అక్తర్ అయితే బాగుంటుందనుకుని ఆయన్ను సంప్రదించారట. కానీ క్రికెట్‌లో బిజీగా ఉండటం వల్ల సినిమాకు సమయం కేటాయించలేనని అక్తర్ ఒప్పుకోలేదట. ఈ విషయాన్ని ఓ సందర్భంలో అక్తర్ వెల్లడించారు. ఒకవేళ అక్తర్ ఆ పాత్రను ఒప్పుకొనుంటే బాలీవుడ్‌లో బిజీ అయిపోయేవాడేమో.

## అప్పడాలు అమ్మిన గణితశాస్త్రవేత్త


'సూపర్30'లో హృతిక్‌రోషన్

ప్రముఖ గణిత శాస్త్రవేత్త ఆనంద్‌కుమార్ అంటే అందరికీ తెలుసు. దేశం గర్వించే స్థాయికి ఎదిగిన ఆయన జీవితంలోనూ ఎన్నో ఆటుపోట్లు ఉన్నాయి. ఎంతోమందికి లెక్కలు నేర్పిన ఈ మాస్టారూ ఒకప్పుడు చదువు కోసం వీధుల్లో అప్పడాలు అమ్మారు. ఎందరికో స్ఫూర్తిదాయకమైన ఆయన జీవితం 'సూపర్30'గా వెండితెరకెక్కింది. ఆనంద్‌కుమార్ పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటుడు హృతిక్‌రోషన్ నటించారు. వికాస్ బల్ తెరకెక్కించిన ఈ చిత్రం వచ్చే నెల 12న విడుదల కానుంది. ఈ చిత్రంలో హృతిక్ అప్పడాలు అమ్ముతున్నట్లు ఉన్న ఓ ఫొటోని ఆయన ట్విటర్‌లో పంచుకున్నారు. "ఆనందకుమార్ గొప్ప గణితశాస్త్రవేత్త కాకముందు అప్పడాలు అమ్మారు. అది ఆయన జీవితంలో చాలా కీలక ఘట్టం"అని ట్వీటారు హృతిక్. ఈ ఫొటోకు నెటిజన్ల నుంచి విశేష స్పందన లభించింది.

భాష రాని వాడే ప్రాస వాడతాడు.
చిత్రం: ఏబీసీడీ,
- పంపినవారు: ఎస్.సూర్యనారాయణ, శ్రీకాకుళం

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

## అమృత నిలయంలో...


విజయ్, మమత

ఒక అంధుడి జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'అమృత నిలయం'. విజయ్, మమత, రిషి ప్రధాన పాత్రధారులు. రాజా విక్రమ నరేంద్ర దర్శకుడు. రామమోహన్ నాగుల, ప్రవీణ్ కుమార్ నిర్మాతలు. ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "మద్యానికి బానిసైన యువతరం చేసే పొరపాట్ల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అలాంటి కుటుంబానికి చెందిన ఓ అంధుడి జీవితం చుట్టూ సాగే చిత్రమిది. సమాజానికి మంచి సందేశాన్నిచ్చే కథ, కథనాలతో తెరకెక్కించాం" అన్నారు. "ఇంటిల్లిపాదికీ వినోదాన్ని పంచడంతో పాటు, ఆలోచన రేకెత్తిస్తుంది. అపరజిత సేవాసమితితో కలిసి వంద మంది అనాథ పిల్లల సమక్షంలో పాటల్ని విడుదల చేశాం. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామ'న్నారు నిర్మాతలు. బేబీ సుహాన, సతీష్ తదితరులు నటించారు. ఛాయాగ్రహణం: మురళీ కంకణాల.

## రాజా... ఒక రకం


ఆకర్షిక

రాజ్ సూరియన్ కథానాయకుడిగా అశ్విన్‌కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'నా పేరు రాజా'. ఈడో రకం... అనేది ఉపశీర్షిక. ఆకర్షిక, నస్రీన్ కథా నాయికలు. ప్రభాకర్‌రెడ్డి, కిరణ్‌రెడ్డితో కలిసి రాజ్ సూరియన్ తెలుగు, కన్నడ భాషల్లో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. "యాక్షన్ ప్రధానంగా సాగే రొమాంటిక్ థ్రిల్లర్ చిత్రమిది. ప్రతి సన్నివేశం థ్రిల్‌కి గురిచేస్తుంది. థ్రిల్లర్ మంజు, మాస్ మద తీర్చిదిద్దిన పోరాట ఘట్టాలు ఆకట్టుకుంటాయి. కథానాయకుడు విభిన్నమైన గెటప్పుల్లో కనిపిస్తాడు. మమ్ముట్టి చిత్రాలకి పనిచేసిన ఎల్విన్ జాషువా సంగీతం, రామ్‌గోపాల్ వర్మ సినిమాకి పనిచేసిన వెంకట్ కెమెరా పనితనం చిత్రానికి ప్రధాన బలాలు. త్వరలోనే పాటల్ని విడుదల చేస్తాం" అన్నారు దర్శకుడు. ప్రభు సూర్య, ఆయుశ్రీ, ఇరాన్ తదితరులు నటించారు.

## నవాజుద్దీన్‌కు జోడీగా తమన్నా


తమన్నా


నవాజుద్దీన్

దక్షిణాదిలో అగ్రతారగా దూసుకుపోతున్న తమన్నా బాలీవుడ్‌లో 'హిమ్మత్‌వాలా', 'హమ్ షకల్స్', 'ఎంటర్‌టైన్‌మెంట్' తదితర చిత్రాల్లో మెరిసింది. ఇప్పుడు ఆమె మరో బాలీవుడ్ చిత్రంలో నటించబోతోంది. నవాజుద్దీన్ సిద్దిఖీ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'బోలే చూడియా'. మొదట ఈ సినిమాలో నాయికగా మౌనీ రాయ్‌ను తీసుకున్నారు. ఆమెకు, నిర్మాతలకు మధ్య విభేదాలు రావడంతో ఆమె వైదొలిగింది. తాజాగా తమన్నాను నాయికగా ఎంచుకున్నారు. ఈ సినిమాలో నటించడంపై తమన్నా ఆనందం వ్యక్తం చేస్తోంది. "ఈ సినిమాలో నటించడం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఈ కథ, కథనాలు నాకు బాగా నచ్చాయి. ఈ తరహా కథలో నటించడం నాకిదే తొలిసారి. నేటి సమాజాన్ని ప్రతిబింబించేలా ఈ కథ ఉంటుంది" అని తమన్నా చెబుతోంది. షామాస్ సిద్దిఖీ తెరకెక్కిస్తున్న ఈ సినిమా వచ్చే నెల నుంచి సెట్స్‌పైకి వెళ్లనుంది.

## భయమెరుగని దేశభక్తుడు


విక్కీ కౌషల్

మెరుపుదాడుల నేపథ్యంలో వచ్చిన 'ఉరీ: ది సర్జికల్ స్ట్రైక్'తో ఘన విజయాన్ని అందుకున్నారు విక్కీ కౌషల్. ఆ ఉత్సాహంతో మరోసారి యుద్ధరంగంలోకి అడుగుపెట్టారు. 1971లో భారత్ - పాకిస్థాన్ యుద్ధం నేపథ్యలో తెరకెక్కుతున్న 'సామ్' అనే చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తున్నారు విక్కీ. ఆ యుద్ధంలో సైన్యాధిపతిగా భారత బలగాలను నడిపించిన ఫీల్డ్ మార్షల్ జనరల్ సామ్ మానెక్‌షా జీవితం ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. 'రాజీ'తో మెప్పించిన మేఘనా గుల్జార్ దర్శకత్వం వహిస్తున్నారు. మానెక్‌షా పాత్రలో నటిస్తున్న విక్కీ లుక్‌ను తాజాగా విడుదల చేశారు. అందులో దట్టమైన మీసం, ఒంటిపై మిలటరీ యూనిఫామ్‌తో ఉన్న విక్కీ, గుర్తుపట్టలేనంతగా మారిపోయారు. "సామ్ మానెక్‌షా జీవితాన్ని ఆవిష్కరించే అవకాశం రావడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. భయమెరుగని దేశభక్తుడు, భారత తొలి ఫీల్డ్ మార్షల్‌గా చరిత్రలో నిలిచిన మానెక్ కథను చెప్పబోతున్నందుకు చాలా ఉత్కంఠగా ఉంద"న్నారు విక్కీ.

సాధికారత, ఆరోగ్యం, పరిశుభ్రత, చట్టాలు వంటి అంశాల పట్ల మహిళలకు అవగాహన కలిగించాలను కుంది మహారాష్ట్ర ప్రభుత్వం. 'వారీ నారీ శక్తి' పేరుతో పల్లకీ యాత్రను ప్రారంభించింది.

## నారీశక్తి చాటే పల్లకీయాత్ర



మహారాష్ట్ర ప్రభుత్వం, మాతాశిశు సంక్షేమ శాఖ సహకారంతో పుణె మహిళా కమిషన్ ఏర్పాటు చేసిందీ యాత్ర. ఇటీవల శనివార్ వాడలో 'వారీ నారీ శక్తి' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. పురుషులతో సమానంగా మహిళలూ కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని చాటిచెప్పేందుకు పల్లకీ యాత్రను నిర్వహించింది. ఇందులో మహిళలు తమ సోదరులతో కలిసి పల్లకీని మోయడం గమనార్హం. 'మహిళలకు సంబంధించి ఎన్నో కొత్త చట్టాలున్నా చాలామందికి వీటి పట్ల అవగాహన ఉండదు. అందరికీ ఈ సమాచారం అందించాలనే ఉద్దేశంతోనే ఈ వారీ నారీ శక్తి యాత్ర ఏర్పాటు చేశాం. దీని ద్వారా ఆరోగ్యం, పరిశుభ్రత, చట్టాలు, రక్షణ, భద్రత వంటి అంశాల పట్ల అవగాహన ఇవ్వాలనుకున్నాం. పల్లకీ యాత్రతోపాటు చిత్రరథం వాహనాన్ని ఏర్పాటు చేశాం. ఇందులో శానిటరీ న్యాప్‌కిన్ల తయారీ యంత్రాలతోపాటు వాటి వినియోగం గురించి సమాచారం ఉంచాం. మహిళా సాధికారతను ప్రతిఫలించే సందేశాత్మకమైన దంగల్, దామిని, టాయిలెట్ - ఏక్ ప్రేమ్ కథ వంటి చిత్రాల ప్రదర్శన ఉంటుంది. వీటితోపాటు మహిళలకు



సంబంధించిన పలు అంశాలపై అవగాహన అందించే పోస్టర్లు ఉంటాయి. ప్రభుత్వ పథకాలు, ముఖ్యమైన చట్టాల వివరాలనూ పొందుపరిచాం. ఈ యాత్రలో నటీనటులు, వైద్యులు, క్రీడాకారులు, న్యాయవాదులు, పారిశ్రామిక వేత్తలు, అమరవీరుల భార్యలు పాల్గొని మరింత అవగాహన పెంచే దిశగా కృషి చేస్తున్నారు' అని చెబుతున్నారు పుణె మేయర్ ముక్తా తిలక్.

# వసుంధర



తొలకరి జల్లు మొదలైంది... నారు పోయాలన్నా, నాట్లు వేయాలన్నా, మొక్కలు నాటాలన్నా... ఇదే అనువైన కాలం. ఇంకెందుకాలస్యం! పని మొదలుపెట్టేయండి.

## తొలకరిలో పూల జల్లు

- పెంచాలనుకున్న మొక్క ఎంత ఎత్తులో పెరుగుతుంది... ఏ లోతులో వేళ్లూనుకుంటుంది... గుబురుగా ఎదుగుతుందా... తీగలా అల్లుకుపోతుందా... అన్ని విషయాలు ముందే తెలుసుకుని కావాల్సిన పరిమాణంలో కుండీని ఎంచుకోండి. వాడకుండా పక్కన పడేసిన బకెట్‌లు, ప్లాస్టిక్ టబ్‌లు వంటివన్నీ ఉపయోగపడేవే. వాటికి చక్కగా పెయింట్ వేసి మొక్కలు నాటేందుకు అనువుగా తీర్చిదిద్దండి.
- మొక్కలు నాటేందుకు ఎన్నోకే ఉండే సమగ్ర ఎరువు, కోకోపీట్‌ని మట్టిలో కలిపి సిద్ధం చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని కుండీల్లో నింపి పెట్టుకోవాలి. నీటి అవసరం తక్కువగా ఉండే మొక్కల కోసం కాస్త ఇసుకనూ చేర్చుకుంటే మంచిది. చీడపీడలు ఎదురుకాకుండా కొద్దిగా వేప పిండినీ అందులో అప్పుడప్పుడూ కలపండి
- చిన్న చిన్న డబ్బాల్లో లోతైన వేళ్లు లేని మొక్కలు అంటే గడ్డిగులాబీ(పోర్ట్యులాకా), మరువం, డయాంథస్ లాంటి పూల మొక్కలు, కొత్తిమీర, మెంతి లాంటి ఆకుకూరల్ని పెంచుకోవచ్చు. వీటిని బాల్కనీ గ్రిల్, ఏదైనా స్టాండ్‌కు వేలాడదీయడం వల్ల స్థలం వృథా కాదు. పెద్ద పెద్ద కుండీల్లో గార్డేనియా, గులాబీ, మందార లాంటివి ఎంచుకోవచ్చు. ఈ



కుండీలను అందంగా అమర్చుకుని ఆ ప్రదేశంలో పాత కుర్చీలు, చిన్న టేబుల్, కొవ్వొత్తులు వంటివి ఏర్పాటుచేస్తే చూడ్డానికి బాగుంటుంది.





# వితంతువుకు చదువెందుకు అన్నారు!

ఆమె జీవితంలో ఎన్నో కన్నీటి చారలు... మరెన్నో కష్టాల బాటలు... వితంతువుగా ఆమె అనుభవించిన వేదన...ఎందరి బతుకులకో వెలుగు దివ్వె... ఆమె చాలీచాలని జీతం... మరెంతో మందికి జీవితం... 29 ఏళ్ల సిఫియా హనీఫ్ కథ ఇది. 500 నిరుపేద కుటుంబాలను అక్కున చేర్చుకుని వారికి విద్య, వైద్యం అందిస్తోందామె. ఆ సేవే నేడు సిఫియాకు 'నీరజా బానోత్ అవార్డు'ను తెచ్చిపెట్టింది.

మాది కేరళ. నాన్న దుబాయ్‌లో ఉద్యోగి. అమ్మ గృహిణి. నాకో సోదరి. నాకు పదహారేళ్లకే పెళ్లి చేశారు. ఆ తరువాత భర్తతో కలిసి బెంగళూరు వచ్చా. ఆయన ఓ ప్రైవేటు సంస్థలో పని చేసేవారు. ఇద్దరు అబ్బాయిలు పుట్టారు. జీవితం ఆనందంగా సాగిపోతోందనుకుంటున్న సమయం అది. పెళ్లయి మూడేళ్లు గడిచాయంతే. ఆయన చనిపోయారు. పెద్దోడికి రెండేళ్లు, చిన్నోడికి ఎనిమిది నెలలు. పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వచ్చేశా. కొన్ని రోజులు బాగానే గడిచింది. కానీ ఎన్నాళ్లలా ఖాళీగా ఉండిపోతా. నా పిల్లల్ని నా కష్టార్జితంతో పెంచాలనుకున్నా. ఇంట్లోవాళ్లకు అదే చెప్పి డిగ్రీ చేస్తా అన్నా. వాళ్లు అంగీకరించకపోగా 'ఆడపిల్ల, అందులోనూ వితంతువు. చదువుకోకూడదు...' అని అడ్డు చెప్పారు. ఏం చేయాలో తెలియలేదు. వాళ్లని ఒప్పించలేక చివరకు పిల్లలను తీసుకొని బెంగళూరు వెళ్లిపోయా. అక్కడ ఏదయినా చిన్న ఉద్యోగం చేసుకుంటూ చదువుకోవాలనుకున్నా.

### బస్టాండ్‌లో దొరికిన ధైర్యం...

ఉద్యోగం కోసం చాలా చోట్లకు కాళ్లరిగేలా తిరిగా. సరైన విద్యార్హత లేకపోవడంతో అందరూ తిరస్కరించినవారే. చేతిలో చిల్లిగవ్వ లేదు. సరిగ్గా తిని పదిరోజులైంది. పిల్లలూ ఆకలితో అలమటిస్తున్నారు. బతుకు భారంగా అనిపించింది. దిక్కు తోచక ఓ రోజు బస్టాండులో కూర్చున్నా. ఏడుపొచ్చేసింది. సరిగ్గా ఆ సమయంలో అక్కడే ఉన్న ఓ వృద్ధురాలు నన్ను ఓదార్చింది. 'బతకడానికి భయపడొద్దు. నీకు నేను అండగా ఉంటా. నీపిల్లల్ని నేను చూస్తా. చిన్న ఉద్యోగమైనా ప్రయత్నించు...' అంటూ ధైర్యం చెప్పింది. అప్పటికి నేను చదివింది ఇంటరే అయినా... ఆంగ్లం ఎంతో కొంత వచ్చు. అదే నాకు ఉపయోగపడింది. ఓ కాల్ సెంటర్‌లో చేరా. జీతం మూడు వేల రూపాయలు. చిన్నగది తీసుకున్నా. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు ఉద్యోగం. అప్పుడు పిల్లల్ని ఆ పెద్దావిడే చూసేవారు. నాకొచ్చే జీతం పిల్లల పోషణకు సరిపోయేది కాదు. ఎనిమిది నెలలపాటు ఆర్థికంగా సతమతమయ్యా.

### జీతంలో సగం వారికే...

నాలాంటి కష్టాలే ప్రతి వితంతువు ఎదుర్కొంటుందని అనిపించింది. అలాంటివాళ్లకు నా వంతుగా సాయం చేయాలని నిర్ణయించుకున్నా. మా సొంతూరు పాల్‌ఘాట్ వెళ్లిపోయా. అక్కడే ఓ ప్రైవేటు ఆసుపత్రిలో రూ.తొమ్మిది వేల జీతానికి రిసెప్షనిస్టుగా చేరా. దూరవిద్యలో బీఏ చేయడం మొదలుపెట్టా. పుట్టింటికి, మెట్టింటికి దూరంగా ఉండి పిల్లల్ని చూసుకుంటూ రోజులు గడిపేదాన్ని. నాలాంటి వారికి అండగా ఉండాలని జీతంలో నా సొంత ఖర్చులకు రూ.5 వేలు మాత్రమే తీసుకొని మిగతాది స్థానికంగా ఉండే వితంతువులకు ఉపయోగించేదాన్ని. మొదట మూడు కుటుంబాలను దత్తత తీసుకున్నా. ఆకలి విలువ తెలిసిన నేను వృద్ధులు, అనాథలు, మానసిక వికలాంగులు, యాచకులకూ భోజనం పెట్టేదాన్ని. ఎక్కువగా మురికివాడల్లోనే ఉండేదాన్ని. నా సంపాదన సేవకు సరిపోకపోవడంతో సాయంత్రాలు ట్యూషన్లు చెప్పేదాన్ని. ఇంకా ఏదో చేయాలనిపించేది.



### ఛితల్ పేరుతో...

బాగా ఆలోచించి ఫేస్‌బుక్‌లో 2015లో 'ఛితాల్' పేరుతో ఓ పేజీ తెరిచా. నాకు ఎదురైన బాధితుల కష్టాలను అందులో పోస్టు చేసి దాతల నుంచి డబ్బు సాయం కోరేదాన్ని. ముందుకొచ్చిన దాతలు నేరుగా బాధితులకే సాయం అందించే ఏర్పాటు చేశా. ఇప్పుడు ఈ పేజీకి లక్షమంది ఫాలోవర్లు. ప్రస్తుతం పాల్‌ఘాట్‌లోని ఎనిమిది గ్రామాలకు చెందిన 500 కుటుంబాల అవసరాలను చూస్తున్నా. ఆహారం, దుస్తులు, వైద్యం, పక్కా ఇళ్లు, మూత్రశాలలూ నిర్మిస్తున్నా. చిన్నారులకు బడి సంచులు, పుస్తకాలు, లంచ్ బాక్సులు అందిస్తున్నా. ఏటా 200 మంది విద్యార్థుల అవసరాలు తీరుస్తున్నా. డిగ్రీ అయిపోయాక బీఈడీ పూర్తిచేసి ఓ ప్రైవేటు పాఠశాలలో చేరా. నాకొచ్చే 20 వేల రూపాయల జీతంలో ఎనిమిది వేలు నా సొంత ఖర్చులకు ఉంచుకొని మిగతాది సేవా కార్యక్రమాలకే ఉపయోగిస్తున్నా. ఒకప్పుడు దీన స్థితిలో ఉన్న నేను ఇప్పుడు నాలాంటి వారికి అండగా నిలుస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఎమ్ఎస్‌డబ్ల్యూ పూర్తి చేశా. ప్రస్తుతం పెద్దోడు ఎనిమిది, చిన్నోడు అయిదో తరగతి చదువుతున్నారు. వాళ్లు రోజూ తలా రెండేసి టిఫిన్ బాక్సులు తీసుకెళ్తారు. ఎవరికైనా లేనివాళ్లకి ఇస్తామమ్మా అంటారు.

### హైదరాబాద్ నుంచీ...

స్థానిక ఎమ్మెల్యేలు, ప్రభుత్వాసుపత్రుల వైద్యులు నాకు సాయం చేయడానికి ముందుకొస్తున్నారు. వైద్యులు ప్రతి వారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. కొందరు ఉపాధ్యాయులు పేద చిన్నారులకు ఉచితంగా ట్యూషన్లు చెబుతున్నారు. నిరుపేదల శస్త్రచికిత్సలకు కొందరు ఆర్థిక సాయం అందిస్తున్నారు. రోజూ చాలామంది తమ సమస్యల గురించి చెబుతుంటారు. ఫేస్‌బుక్ ద్వారా ఇతర రాష్ట్రాల నుంచీ ముఖ్యంగా హైదరాబాద్, ఆంధ్రా నుంచీ నన్ను సంప్రదిస్తుంటారు. వాళ్లకు అవసరమైన వైద్యసాయం కోసం డబ్బు సేకరిస్తుంటా. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి స్ఫూర్తిదాయక తరగతులు చెబుతున్నా. ఇప్పుడు అమ్మానాన్న నన్ను అర్థంచేసుకున్నారు. వాళ్లకు తోచిన సాయం చేస్తున్నారు. భవిష్యత్తులో పీహెచ్‌డీ చేయాలనుకుంటున్నా. నా గురించి ఓ ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనం చూసి నీరజా బానోత్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డు సామాజిక సేవ చేసేవాళ్లకే ఇస్తారని తెలిసి చాలా ఆనందంగా అనిపించింది. దీని ద్వారా వచ్చే రూ.లక్షన్నర నగదు బహుమతిని పేదవాళ్లకే ఇచ్చేయాలనుకుంటున్నా. కొత్తల్లో నెలాఖరులో నా చేతిలో చిల్లిగవ్వ మిగిలేది కాదు. అయినా ఏ రోజూ బాధపడలేదు. వీలైనంత మందికి సాయం చేయడమే నా లక్ష్యంగా పెట్టుకున్నా.

## నెలసరి రావడంలేదు!

నేను రెండు గంటలు ఈతకు, రెండు గంటలు నడకకు వెళతా. కొన్ని రోజులకే నెలసరిలో తేడా మొదలైంది. చాలా కొద్దిగా మాత్రమే రక్తస్రావం అవుతోంది. దీనికి ఏదైనా కారణమా?

– ఓ సోదరి

డియర్ వసుంధర



డా. అనగాని మంజుల, గైనకాలజిస్టు

✔ మీ ఉత్తరం ప్రకారం మీరు ఎక్కువసేపు వ్యాయామం చేస్తున్నట్లు తెలుస్తోంది. మీరు కచ్చితంగా సన్నబడతారు కానీ... శరీరంలో కొవ్వు శాతం పూర్తిగా తగ్గిపోతుంది. నెలసరి సక్రమంగా రావడానికి శరీరంలో ఈస్ట్రోజెన్ శాతం సరిగ్గా ఉండాలి. అప్పుడే కొవ్వు నుంచి ఈస్ట్రోజెన్ విడుదల అవుతుంది. అది లేనప్పుడే హార్మోన్ల పనితీరులో తేడా వస్తుంది. ఆ తేడానే నెలసరిపై పడుతుంది. మీ సమస్యా అదే అయ్యుంటుంది. కొన్నిసార్లు ఒత్తిడితోనూ ఇలా కావొచ్చు. ముందు మీరు ఎన్ని కేజీల బరువు తగ్గారో చూసుకోండి. మీరు అనుకున్న లక్ష్యం చేరుకుంటే... కొన్నాళ్లు చేసే వ్యాయామ సమయాన్ని తగ్గించండి. పూర్తిగా డైటింగ్ చేయకుండా పోషకాహారాన్ని తీసుకుంటూనే వ్యాయామం చేయండి. ఓసారి గైనకాలజిస్టును సంప్రదిస్తే... స్కానింగ్ చేసి అండాశయాల్లో సిస్టులు, హార్మోన్లలో తేడాలు, ఇతర సమస్యల్ని అంచనా వేస్తారు. సమస్య ఉందనుకుంటే తదనుగుణంగా చికిత్స సూచిస్తారు.

– మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.

## కంటి అందానికి ఉప్పు వద్దు!

కళ్ల అడుగున ఏర్పడే నల్లని వలయాల్ని పోగొట్టేందుకు ఏవో పూతలు వేసుకోవడమే కాదు... ఈ చిట్కాలూ పాటించి చూడండి. చాలా తక్కువ సమయంలో మార్పు కనిపిస్తుంది.



- ✦ ఆహారంలో ఉప్పును ఎక్కువగా తీసుకుంటున్నా చర్మం తేమను గ్రహించే శక్తి కోల్పోతుంది. చర్మం పొడిబారి కంటికింద ఉబ్బినట్లు అవుతుంది. కొన్నాళ్లు ఉప్పు మోతాదు తగ్గించి చూడండి.
- ✦ దిండు గలేబుల్ని ఉతక్కుండా ఎక్కువ రోజులు వాడినా... వాటిపై పేరుకున్న క్రిములు చర్మానికి హాని చేయొచ్చు. ముఖ్యంగా కంటి కింది చర్మం నల్లగా ఉబ్బినట్లుగా మారుతుంది. వాటిని కనీసం పదిహేను రోజులకోసారి ఉతకడం మంచిది.
- ✦ ముఖానికి వేసుకున్న మేకప్ తొలగించకపోయినా ఈ సమస్య ఎదురవుతుంది. అలంకరణ సామగ్రిలోని రసాయనాలు చర్మానికి హాని చేయడమే కారణం. అలంకరణ తొలగించాకా కళ్ల చుట్టూ కొద్దిగా బాదం నూనె రాసి చాలా నెమ్మదిగా మర్దన చేస్తే ఈ సమస్య చాలామటుకూ ఎదురుకాదు.
- ✦ కళ్లపై నేరుగా ఎండ పడకుండా చూసుకోవాలి. ఎండలో బయటికి వెళ్లినప్పుడు చలువ కళ్లద్దాలు పెట్టుకోవడం మంచిది. బయటికి వెళ్లి వచ్చిన తరువాత చల్లని నీటిలో ముంచిన తువాలును కళ్లపై వేసి కాసేపు ఉంచితే ఉపశమనం ఉంటుంది.
- ✦ నాలుగు చెంచాలను రాత్రంతా ఫ్రిజ్‌లో పెట్టి, మరుసటి రోజు ఉదయం ఒక్కోదాన్ని ఒక్కో కంటి కింద కొంతసేపు ఉంచాలి. ఆ ప్రదేశంలో రక్త ప్రసరణ మెరుగవుతుంది. కళ్లు తాజాగా కనిపిస్తాయి.
- ✦ ప్రతి రోజు కనీసం ఏడు నుంచి ఎనిమిది గంటలు నిద్రపోవాలి. కంటికి ఒత్తిడి కలిగించే పనులకు దూరంగా ఉండాలి. అదే పనిగా కంప్యూటర్, ఫోన్లు చూడకూడదు. నిద్ర వల్ల వచ్చే ప్రశాంతతతో కంటి కింద చర్మంపై ఒత్తిడి తగ్గి, వలయాలు దూరమవుతాయి.

### నజరానా

గొంతు నొప్పిగా ఉందా... కప్పు నీళ్లలో చిన్న అల్లం ముక్క, అర చెంచా దాల్చిన చెక్క పొడి వేసి మరిగించండి. తరువాత ఆ నీరు గోరువెచ్చగా అయ్యాక చెంచా తేనె కలిపి తాగండి. ఉపశమనం ఉంటుంది.

### బంగారం వెండి



28న ముగింపు-క్రితం

| | హైదరాబాద్ | | విజయవాడ | |
|---|---|---|---|---|
| బంగారం(24క్యా) | 35,160 | 34,970 | 35,290 | 35,230 |
| ఆర్నమెంట్ | 32,820 | 32,670 | 32,700 | 32,650 |
| వెండి (కిలో) | 38,530 | 38,600 | 38,700 | 38,900 |
| | **ప్రొద్దుటూరు** | | **రాజమహేంద్రవరం** | |
| బంగారం(24క్యా) | 33,950 | 33,950 | 35,220 | 35,100 |
| ఆర్నమెంట్ | 31,340 | 31,570 | 32,540 | 32,390 |
| వెండి (కిలో) | 38,700 | 38,800 | 38,600 | 38,700 |
| | **విశాఖపట్నం** | | **తమిళనాడు** | |
| బంగారం(24క్యా) | 34,980 | 34,940 | ------ | ------ |
| ఆర్నమెంట్ | 32,540 | 32,500 | 3,254 | 3,239 గ్రా |
| వెండి (కిలో) | 39,500 | 39,500 | 40.60 | 40.60 గ్రా |

## స్త్రీ శక్తి @ శ్రీ సిటీ



ఒకప్పుడు మగవాళ్ల అరకొర సంపాదనతోనే కుటుంబాన్ని నెట్టుకొచ్చే ఆ మహిళలు ఇప్పుడు ఆదాయబాట పడుతున్నారు. అక్కడున్న పారిశ్రామిక నగరం 'శ్రీసిటీ' ప్రస్తుతం స్త్రీ శక్తికి చిరునామాగా నిలుస్తోంది. యాభై శాతం కంటే ఎక్కువ ఉద్యోగాలు మహిళలే చేయడం విశేషం. ఇది ఆంధ్రప్రదేశ్‌లోని సత్యవేడు, వరదయ్యపాలెం(చిత్తూరు జిల్లా), తడ(పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా) మండలాల పరిస్థితి.

శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా 35 వేల మంది పనిచేస్తోంటే ఇందులో మహిళా ఉద్యోగులకే అధిక ప్రాధాన్యం. ఎలాంటి నైపుణ్యం, ఉన్నత విద్యార్హతలు లేకున్నా అతివలకు పెద్దపీట వేస్తున్నాయి చాలా సంస్థలు.

### ఒకే పరిశ్రమలో 11వేల మంది

ఎలక్ట్రానిక్స్ రంగం, ఫుడ్ ప్రాసెసింగ్, బొమ్మలు, టీ, దుస్తుల తయారీ పరిశ్రమల్లో మహిళలు కీలకంగా వ్యవహరిస్తున్నారు. సెల్‌ఫోన్లు తయారు చేసే పరిశ్రమలోనే 11 వేలకు పైగా మహిళలు ఉండటం గమనార్హం. కెల్లాగ్స్, పెప్సికో వంటి పరిశ్రమల్లోనూ సుమారుగా 20 నుంచి 90 శాతం మహిళలు ఉన్నారు. ఇక్కడ వీళ్లకు అవసరమైన శిక్షణ అందుతుంది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన షియోమి, జియోని వంటి బ్రాండ్ల ఫోన్లు ఈ గ్రామీణ మహిళల చేతుల్లో తయారవడం విశేషం.

### ఉచిత ఉపాధి, వృత్తి శిక్షణ...

శ్రీసిటీ-ఐఎల్ఎఫ్ఎస్ సంస్థలు సంయుక్తంగా కుట్టుపని, ప్లంబింగ్, హౌస్ కీపింగ్, ఉద్యాన పరిరక్షణ, సెక్యూరిటీ, తోలు వస్తువుల తయారీ తదితర వృత్తుల్లో ఎనిమిదేళ్లుగా ఉచితంగా శిక్షణ అందిస్తున్నాయి. వారిలో మహిళలే ఎక్కువ. ఒకప్పుడు అక్కడి యువత వ్యవసాయ పనులు, పశువులు మేపడం, ఇంటి నిర్మాణ పనులకు వెళ్లి బతుకు నెట్టుకొచ్చేవారు. ఇప్పుడు వారి ఆర్థిక పరిస్థితులు పూర్తిగా మారాయి. మద్యం, పేకాట అలవాట్లతో ఛిన్నాభిన్నమైన కుటుంబాల్లో వెలుగులు వచ్చాయి. కొన్ని ఇళ్లల్లో మహిళల సంపాదనే కుటుంబానికి ఆధారం. పిల్లల్ని చదివించు కుంటున్నారు.



### పారిశ్రామిక నగరం...

చిత్తూరు జిల్లాలోని సత్యవేడు, వరదయ్యపాలెం, నెల్లూరు జిల్లాలోని తడ మండలాల్లోని 7500 ఎకరాల్లో శ్రీసిటీ వ్యాపార నగరం విస్తరించింది. ఈ పారిశ్రామిక వాడ పెట్టుబడులకు అనువుగా ఉంటుంది. ఉపాధి కల్పనలోనూ అగ్రగామిగా నిలుస్తోంది. వెనుకబడిన ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఉపాధి కల్పించాలన్న ధ్యేయంతో 2008లో శ్రీసిటీ యాజమాన్యం ఇక్కడ ఒక ప్రత్యేక ఆర్థికమండలిని స్థాపించింది. నేడు ప్రపంచ వాణిజ్య పటంలో శ్రీసిటీకి ప్రత్యేక స్థానం ఉంది.

–కళ్లిపూడి దేవేంద్రరెడ్డి, సూళ్లూరుపేట

Eenadu epaper

